క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొరిటిపాడు: మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. ఈ మేరకు విద్యుత్ శాఖ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.హెచ్.ఖాన్, అసిస్టెంట్ ఇంజినీర్ రవికుమార్‌లు గురువారం తెలిపారు. 11 కేవీ రైల్వే క్వార్టర్స్ ఫీడర్ మరమ్మతుల నిమిత్తం సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. గుంటూరు రైల్వే క్వార్టర్స్, న్యూ గుంటూరు రైల్వే స్టేషన్, వెంకటాద్రిపేట, బుచ్చయ్యతోట, 6వ లైను, నెహ్రూనగర్ 9, 10, 11వ లైనులు తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదని తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.
మారుతీనగర్ ఫీడర్‌లో మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ డెప్యూటీ ఇంజినీర్ పి.హెచ్.ఖాన్ తెలిపారు. ఎల్‌బీ నగర్, వీరయ్య చౌదరి నగర్, జాకీర్ హుస్సేన్ నగర్, బాలాజీ నగర్ జీరో లైన్ తదితర ప్రాంతాల్లో ఉదయం 8 – మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

వసతి గృహాన్ని ప్రారంభించాలి




లక్ష్మీపురం: సాంఘిక సంక్షేమ సమీకృత వసతి గృహాన్ని (కోడిగుడ్డు సత్రం హాస్టల్‌ను) వెంటనే ప్రారంభించాలని ఎమ్మెల్యేను ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ తదితరులు కోరారు. వసతి గృహాన్ని గురువారం తూర్పు నియోజకవర్గ శాసన సభ్యుడు నసీర్ అహ్మద్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘ నాయకులు పలువురు ఎమ్మెల్యేతో మాట్లాడారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... సత్రం హాస్టలు ఇప్పటివరకు నిర్మాణంలో ఉండటం వల్ల విద్యార్థుల నష్టపోయారన్నారు. హాస్టల్ పూర్తయినప్పటికీ బిల్లులు రాలేదనే సాకుతో నేటికీ డిపార్ట్‌మెంట్‌కి అప్పగించకపోవడం బాధాకరం అన్నారు. కోడిగుడ్డు సత్రం హాస్టల్ ఉండటం విద్యార్థులకు అన్ని విధాలా సౌకర్యంగా ఉంటుందని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు అన్నారు. దీన్ని తక్షణమే ప్రారంభించాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నగర కార్యదర్శి ఎ.యశ్వంత్, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అష్టోత్తర శత కలశాభిషేకం



నగరంపాలెం: స్థానిక కృష్ణానగర్ ఒకటో వీధిలో వేంచేసియున్న శ్రీగోదా పద్మావతి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి వారి 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తిరుమంజన సేవ కనుల పండువగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులను ఆలయ ప్రాంగణంలో విశేషంగా అలంకరించారు. అర్చక బృందం మేళతాళాలతో వేదికపైకి స్వామిని చేర్చారు. ప్రజా సంక్షేమం, లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ కార్యక్రమం నిర్వహించారు. విశేష హారతి అనంతరం తీర్థ ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం హోమం జరగ్గా, ధనకుదరం శ్రీనివాసాచార్యులు పర్యవేక్షించారు.

వజ్రాభరణాల ప్రదర్శన



నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురంలోని మలబార్ గోల్డ్ – డైమండ్స్ షోరూంలో ప్రత్యేక వజ్రాభరణాల ప్రదర్శనను గురువారం డాక్టర్ పాలకుర్తి శ్రీస్నేహ, డాక్టర్ రోహిత, పెద్ది రమణారావు ప్రారంభించారు. రోజు ధరించే నగలు, పెళ్లి ఆభరణాలు, లైట్ వెయిట్ నగలు, పురుషుల ఆభరణాలను అందుబాటులో ఉంచినట్లు స్టోర్ హెడ్ నదిర్, ఎంటీ జితిన్, మార్కెటింగ్ మేనేజర్ గోపికిరణ్ తెలిపారు. ఈ నెల ఐదు నుంచి పదో తేదీ వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుందని అన్నారు. వినియోగదారులు కొనుగోలు చేసే బంగారం విలువలో పది శాతం ముందుగా చెల్లించి అడ్వాన్స్ బుకింగ్ సదుపాయం పొందవచ్చునని వారు పేర్కొన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మించాలి

దుగ్గిరాల: దుగ్గిరాల హౌసింగ్ కాలనీ దగ్గర విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు అన్నారు. మండల పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన గురువారం మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీల స్మార్ట్ మీటరు వ్యతిరేకించాలని, విద్యుత్ బిల్లులు తగ్గించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జెట్టి బాలరాజు, స్టాలిన్, బ్రహ్మేశ్వర రావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



నెహ్రూనగర్: ర్యాలీలో పాల్గొన్న మేయర్ రవీంద్ర, కమిషనర్ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు

నెహ్రూనగర్: పర్యావరణ పరిరక్షణకు జనపనార, వస్త్ర సంచులను వినియోగించాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర ప్రజలను కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు మహ్మద్ నసీర్, గల్లా మాధవి, ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్, డెప్యూటీ మేయర్ షేక్ సజీల, అధికారులు, కార్పొరేటర్లతో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కన్యకా పరమేశ్వరి దేవాలయం నుంచి అవగాహన ర్యాలీ, మాస్ క్లీనింగ్ చేపట్టారు. నగర పాలక సంస్థ పార్కింగ్ ప్రాంతంలో మొక్కలు నాటారు. అనంతరం ప్రజారోగ్య కార్మికులకు జీఎంసీ చేపట్టిన ఉచిత మెడికల్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఐటీసీ వారు అందించిన వస్త్ర సంచులను పంచిపెట్టారు. స్వచ్ఛ హరితాంధ్ర కోసం కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. గాంధీ పార్క్ వద్ద రూ.20కు వస్త్ర సంచులను ఇచ్చే కియాస్క్ మెషిన్‌ని, ప్లాస్టిక్, ఈ –వేస్ట్ కలెక్షన్ పాయింట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా భాగస్వాములు కావాలన్నారు. గుంటూరు నగరపాలక సంస్థ తరపున సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధానికి పటిష్ట చర్యలు తీసుకుంటామని తెలిపారు. అందులో భాగంగా ప్రజలకు ప్రత్యామ్నాయంగా వస్త్ర సంచులను అందించే యంత్రాలను నగరంలోని ప్రధాన కేంద్రాల్లో ఏర్పాటు చేస్తామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ వినియోగం నిషేధం తప్పనిసరని పేర్కొన్నారు. నగర పౌరులు బాధ్యతగా సహకరించాలని కోరారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వార్డుల వారీగా మొక్కలు నాటడం, అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. గాంధీ పార్కు, ఎన్టీఆర్ స్టేడియం వద్ద వస్త్ర సంచుల వెండింగ్ మెషీన్లను అందుబాటులో ఉంచామన్నారు. కేజీ ప్లాస్టిక్ వ్యర్థాలు ఇస్తే గాంధీ పార్కు ఎంట్రీ టికెట్ ఉచితంగా అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, డెప్యూటీ కమిషనర్లు, విభాగాధిపతులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



గుంటూరు మెడికల్: మొక్కలు నాటుతున్న బీజేపీ నేతలు

గుంటూరు మెడికల్: స్థానిక విద్యానగర్ లిటిల్ ఫ్లవర్ స్కూల్ ఆవరణలో గురువారం బీజేపీ నేతలు మొక్కలు నాటారు. ముఖ్య అతిథిలుగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ, జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రధాని పిలుపు మేరకు అందరూ తమ వంతుగా మొక్కలు నాటాలని చెప్పారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందజేయడం అందరి బాధ్యత అని వెల్లడించారు. కార్యక్రమంలో పాలపాటి రవి కుమార్, కోలా రేణుకాదేవి, తోట శ్రీనివాసరావు, భజరంగ్ రామకృష్ణ, దేసు సత్యనారాయణ, దర్శనపు శ్రీనివాస్, ఈమని మాధవరెడ్డి, లక్ష్మణ్, బూతు అధ్యక్షులు సాయికృష్ణ, రమణ, 2వ మండల అధ్యక్షులు పెసల వెంకటేశ్వర్లు, నారాయణ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకం తగ్గించండి



గుంటూరు మెడికల్: పోస్టర్‌లను పరిశీలిస్తున్న డాక్టర్ సుందరాచారి

గుంటూరు మెడికల్: గుంటూరు మెడికల్ కాలేజీలో గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో వైద్య విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేలా పోస్టర్ పోటీలు నిర్వహించారు. వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకట సుందరాచారి ఆ పోస్టర్లను ఆసక్తిగా పరిశీలించారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రశంసించారు. ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నియంత్రించాలన్నారు. పోటీలకు బయో కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ నవనీత లక్ష్మి, మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ జయలక్ష్మి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. విద్యార్థులు ఫ్లాష్ మాబ్ ప్రదర్శన నిర్వహించారు. ప్లాస్టిక్ రహితంగా రూపొందించిన ప్రత్యేక బ్యానర్ ఆకర్షించింది. దీనిని రూపొందించిన కమ్యూనిటీ మెడిసిన్ విభాగానికి చెందిన పీజీలు డాక్టర్ స్నేహ, డాక్టర్ అపూర్వ, డాక్టర్ రాజేశ్‌లను అభినందించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డా. సీతారామ, ప్రొఫెసర్ డాక్టర్ పూర్ణమ్మ, పలువురు అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పీజీలు పాల్గొన్నారు.

కార్మికులు రక్షణ పరికరాలు ధరించాలి



టాయిలెట్లను ప్రారంభించిన మేయర్ రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: యూజీడీ, సెప్టిక్ ట్యాంక్ కార్మికులు విధుల్లో తగిన రక్షణ పరికరాలు ధరించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సూచించారు. గురువారం నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టం (నమస్తే)లో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ (యూజీడీ), సెప్టిక్ ట్యాంక్‌లను శుభ్రపరిచే కార్మికులకు పని ప్రదేశాల్లో తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ యూజీడీ, సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ కార్మికులు నిత్యం ప్రమాదకర ప్రాంతాల్లో పనులు చేస్తూ ప్రజారోగ్యానికి రక్షణగా నిలుస్తున్నారన్నారు. కార్మికుల ఆరోగ్య భద్రతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాయన్నారు. నమస్తే పథకం ద్వారా గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో యూజీడీ కార్మికులకు పీపీఈ కిట్లు అందించామని చెప్పారు. కార్మికులు విధుల్లో తప్పనిసరిగా రక్షణ పరికరాలు ధరించడం ద్వారా ప్రమాదాల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఈఈ సుందర్రామిరెడ్డి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి అనిల్, వినయ్, జీఎంసీ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ స్పెషలిస్ట్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

కమ్యూనిటీ టాయిలెట్స్ కూడా...

ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను వినియోగించుకోవాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు సూచించారు. ఐటీసీ బంగారు భవిష్యత్ ఆధ్వర్యంలో ఇమ్మానుయేలు పేటలో నిర్మించిన కమ్యూనిటీ టాయిలెట్లను గురువారం నగర మేయర్, కమిషనరు కలిసి ప్రారంభించారు. ఐటీసీ బంగారు భవిష్యత్ వారు కమ్యూనిటీ టాయ్‌లెట్స్ నిర్మాణం చేపట్టడం అభినందనీయమన్నారు.

చినుకు పడితే రోడ్డంతా జలమయం



గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని విద్యానగర్ 3వ లైనులో రోడ్డు అధ్వానంగా తయారైంది. ఇక్కడ రోడ్డు వేయకపోవడంతో చిన్నపాటి వర్షానికి కూడా ఆ ప్రాంతమంతా తటాకాలను తలపిస్తోంది. అభివృద్ధి పనులకు కొన్ని రూ.కోట్లు ఖర్చు పెడుతున్నామని చెబుతున్న అధికారులు ఇలాంటి ప్రాంతాల్లో రోడ్లు వేయకపోవడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
– నెహ్రూనగర్

భవిష్యత్ అవసరాలకు తగ్గట్లు బ్రిడ్జి నిర్మించాలి



మాట్లాడుతున్న వి.అర్లరెడ్డి

నెహ్రూనగర్: భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా శంకర్ విలాస్ బ్రిడ్జి పునర్నిర్మాణం జరగాలని పలువురు సాంకేతిక నిపుణులు అభిప్రాయపడ్డారు. గురువారం బ్రాడీపేట బాలానంద కేంద్రం ఆవరణలో శంకర విలాస్ ఫ్లైఓవర్ సాధన సమితి ఆధ్వర్యంలో సాంకేతిక నిపుణులతో కార్యక్రమం నిర్వహించారు. ఓవర్ బ్రిడ్జి నిర్మాణం ద్వారానే అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని సీనియర్ స్ట్రక్చరల్ ఇంజినీర్ వి.అర్ల రెడ్డి పేర్కొన్నారు. సుమారు 7 దశాబ్దాల క్రితం నిర్మించిన బ్రిడ్జి స్థానంలో మరొక వంద సంవత్సరాల అవసరాలు తీరేలా కొత్త బ్రిడ్జి నిర్మించాలని సూచించారు. ప్రభుత్వ పెద్దలు దూరదృష్టి లేకుండా మొండి పట్టుతో వ్యవహరించడం తగదన్నారు. అవగాహనా రాహిత్యంతో భవిష్యత్ తరాలకు శాపంగా మారేలా బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అండర్ పాసులు, సబ్‌వేలతో కూడిన ఫ్లైఓవర్ నిర్మించి ప్రజల అభిమానం పొందాలని సూచించారు. సభకు అధ్యక్షత వహించిన ఫ్లై ఓవర్ సాధన సమితి కన్వీనర్ ఎల్‌ఎస్ భారవి మాట్లాడుతూ పొడవు కుదించిన ఆర్‌ఓబీ వల్ల లక్షల మంది ప్రజలకు కలిగే ఇబ్బందులకు ఏకైక పరిష్కారం ఆర్‌యూబీతో పాటు అండర్ పాస్ నిర్మాణం అన్నారు. అధికారులకు ఎంత చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శాంతియుత నిరసన ద్వారానే వీటిని సాధించాలన్నారు. ఆ పరిస్థితిని ప్రభుత్వ పెద్దలు కల్పించకూడదని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రైతు నాయకుడు చుండూరు రంగారావు, ఆడిటర్లు పీవీ మల్లికార్జునరావు, సుబ్బారావు, నడింపల్లి గురుదత్, డీఏఆర్ సుబ్రహ్మణ్యం, కె.నళినీకాంత్, రాధాకృష్ణ, అవధానుల హరి, బెల్లంకొండ శ్రీనివాసరావు, వల్లూరి సదాశివరావు, అక్బర్, సదాశివరావు, డి ఏడుకొండలు, ఇంజినీర్ వెంకట్రావు, శివన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు



నెహ్రూనగర్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి ఆదేశాల మేరకు పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో 159 మందికి ఉచితంగా పరీక్షలు చేసి, అవసరమైన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు రోహిణి రత్నశ్రీ, వరప్రసాద్, అబూబకర్, సైమన్‌రాజు, గిరిధర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గోవధ నిషేధ చట్టం అమలు చేయాలి



నగరంపాలెం: బక్రీద్ పండుగ రోజున గోవధ నిషేధం చట్టం అమలు చేయాలని విశ్వహిందూ పరిషత్ గోరక్ష విభాగ్ ప్రాంత సహ ప్రముఖ్ మన్నవ చలపతిరావు డిమాండ్ చేశారు. గురువారం కొత్తపేటలోని పశుసంవర్ధక శాఖ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అధికారులకు గోరక్ష విభాగ్, జిల్లా బ్రాహ్మణ సంఘాలు సంయుక్తంగా వినతిపత్రం అందించాయి. చలపతిరావు మాట్లాడుతూ గుంటూరు నగరంతో పాటు ఉమ్మడి జిల్లాలోని ఆవులు, కోడెలు, ఎద్దుల విక్రయాలపై అవగాహన కల్పించాలని అన్నారు. అఖిలభారత బ్రాహ్మణ సేవా సమాఖ్య నాయకులు కొలిపాక ప్రసాద్, కౌశిక్ ప్రసాద్, పాండురంగారావు, సోమరాజు శ్రీనివాస్, భాగవతుల రవికుమార్, శివరామ కృష్ణవర్మ, మత్తి భాస్కరరావు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీ నరసింహ స్వామిగా అలంకరణ



శ్రీలక్ష్మీనరసింహ స్వామి అలంకరణలో శ్రీవేణుగోపాల స్వామి వారు

నగరంపాలెం: స్థానిక కొత్తపేటలోని శ్రీజగన్నాథ స్వామి వారి దేవస్థానంలో శ్రీరుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం శ్రీ వేణుగోపాల స్వామి వారికి శ్రీలక్ష్మీనరసింహ స్వామి అలంకారం నిర్వహించారు. అనంతరం శ్రీలక్ష్మీ నరసింహ హోమం, మూల మంత్ర హోమం, గ్రామ బలిహరణ చేపట్టారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. దేవస్థానం ఈవో టి.సుభద్ర కార్యక్రమాలను పర్యవేక్షించారు.

విద్యాభివృద్ధికి ఎనలేని కృషి



సత్కరిస్తున్న నాయకులు

నగరంపాలెం: విద్యాభివృద్ధికి పలువురు ఎనలేని కృషి చేశారని ఏఐఎస్టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసెఫ్ సుధీర్‌బాబు అన్నారు. గుంటూరు జిల్లా ఉర్దూ పాఠశాల డీఐగా విధులు నిర్వహిస్తూ యరగ్రొండపాలెం ప్రభుత్వం ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా ఉద్యోగోన్నతి పొందిన ఎండీ ఖాసీం, షేక్ ఖాజావలి, గేరా నాగేశ్వరరావులను గురువారం ఎస్టీయూ భవన్‌లో సత్కరించారు. వారు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు డి.పెద బాబు, ప్రధాన కార్యదర్శి డి.కె.సుబ్బారెడ్డి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన సాయినాథుని బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే గల్లా మాధవి

నగరంపాలెం: స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీ శ్రీషిరిడీ సాయినాథ మందిరంలో 23వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి. బాబా వారికి కాకడ హారతి, పంచామృతాలు, విశేష ద్రవ్యాలతో అభిషేకం, అలంకార పూజ, అర్చన, సహస్రనామార్చన తదితరాలను వేద పండితులు నిర్వహించారు. ఆలయ అధ్యక్షులు మామిడి సీతారామయ్య దంపతులు సాయినాథునికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం బాబా వారికి లక్ష మల్లెలార్చన భక్తి ప్రపత్తులతో చేపట్టారు. పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవికి ఆలయ పాలకవర్గం పూర్ణకుంభంతో స్వాగతం పలికింది. సాయినాథుని సన్నిధిలో ప్రత్యేక పూజల్లో పాల్గొనగా, అన్న ప్రసాద వితరణ ప్రారంభించారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, అడపా మాణిక్యాలరావు, ఆలయ గౌరవ అధ్యక్షుడు మామిడి రామారావు పాల్గొన్నారు.

పిక్చర్ పోస్టు కార్డులు విడుదల



ఉండవల్లి గుహల ప్రాముఖ్యతను వివరించే పోస్ట్ కార్డులను విడుదల చేస్తున్న అధికారులు

మంగళగిరి టౌన్: తాడేపల్లిలోని ఉండవల్లి గుహల ప్రాముఖ్యతను వివరిస్తూ గురువారం పోస్టల్ డిపార్ట్‌మెంట్, పురావస్తు శాఖ సహకారంతో ఉండవల్లి గుహల వద్ద అయిదు పిక్చర్ పోస్టు కార్డులను విడుదల చేశారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ డీఎస్‌వీఆర్ మూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పిక్చర్ పోస్టు కార్డులు ఉండవల్లి గుహల్లో కొలువైన విష్ణుమూర్తి విగ్రహం ప్రాధాన్యతను, ఆ గుహల శిల్ప కళాకృతులను తెలియజేసే విధంగా రూపొందించినట్లు తెలిపారు. ఈ పోస్టు కార్డులను ప్రతి ఒక్కరూ దగ్గరలోని ప్రధాన పోస్ట్ ఆఫీస్‌లో లేదా సబ్ పోస్ట్ ఆఫీసులో కానీ రూ. 150 చెల్లించి పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోస్టల్ సర్వీసెస్ డైరెక్టర్ కె.సంతోష్ నేత, ఆర్కియాలజిస్ట్ డిపార్ట్‌మెంట్ సూపరింటెండెంట్ డాక్టర్ దేజేంద్రనాథ్, గుంటూరు పోస్టాఫీస్ సూపరింటెండెంట్ యు.యల్లమందయ్య, అసిస్టెంట్ డైరెక్టర్ జి.శివనాగరాజు, ప్రముఖ ఫిలాటెలిస్టు చల్లా అప్పారావు, తపాలా శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తితిదే నిత్యాన్నదానానికి కూరగాయలు వితరణ



జెండా ఊపి కూరగాయల వాహనాన్ని ప్రారంభిస్తున్న ఢిల్లీరావు

తాడేపల్లి రూరల్: అన్ని దానాల్లో అన్నదానం గొప్పదని వ్యవసాయ శాఖ కమిషనర్ ఎస్.ఢిల్లీ రావు అన్నారు. గురువారం తాడేపల్లి పట్టణ పరిధిలోని విజయవాడ క్లబ్ రోడ్ నివాసితులు ఎస్ఎస్‌వీ ప్రసాద్ నన్నపనేని, రేవతి దంపతులు.. అక్షయిత, శ్రీహిత కుటుంబ సభ్యుల సహకారంతో తిరుమల తిరుపతి దేవస్థానం నిత్య అన్నదాన నిర్వహణకు 10 టన్నుల కూరగాయలు వితరణ చేశారు. ఆ వాహనాన్ని ఢిల్లీరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనార్థం వచ్చే భక్తుల కోసం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి సాయం చేసే అవకాశం సామాన్యులకు కూడా కల్పించడం ఎంతో ముదావహమన్నారు. నన్నపనేని ప్రసాద్, రేవతి దంపతులు మాట్లాడుతూ.. కూరగాయలను విరాళంగా అందిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమ నిర్వాహకులు మరడ నాగేంద్ర మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాన్ని కీర్తిశేషులు మండవ కుటుంబరావు 2006లో ప్రారంభించారని తెలిపారు. గత 18 ఏళ్లుగా తితిదేకు కూరగాయలను వితరణగా అందిస్తున్నామన్నారు.

7న సరస్వతీ దేవాలయం భూమిపూజ



తెనాలి: పట్టణ బుర్రిపాలెం రోడ్డులోని శ్రీవివేకానంద సెంట్రల్ స్కూలు దగ్గర నూతనంగా నిర్మించనున్న 'సువర్ణ భారతి క్షేత్రం' (సరస్వతి దేవాలయం)కు ఈనెల 7న జరగనున్న భూమి పూజ ఆహ్వాన పత్రికను గురువారం ఆవిష్కరించారు. స్థానిక గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠంలో సాలిగ్రామ మఠం ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామీజీ)చే ఆరోజు ఉదయం 7.45 గంటలకు విశేష హోమాలు, పూజలు ఆధ్యాత్మిక ప్రవచనాలు జరుగుతాయని తెలిపారు. బాలస్వామీజీతో పాటు ట్రస్ట్ చైర్మన్ నంబూరి వెంకటకృష్ణమూర్తి, కార్యదర్శి రావూరి సుబ్బారావు, ఉపాధ్యక్షుడు పెనుగొండ వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి ముద్దాభక్తుని రమణయ్య, కోశాధికారి గోపు రామకృష్ణ, తాడిబోయిన వీరరాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ అనుకూల విధానాల కోసం సీఎం తాపత్రయం



సమావేశంలో మాట్లాడుతున్న నేతాజీ

తాడేపల్లి రూరల్: కార్మికుల శ్రమను కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా దోచి పెట్టడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాపత్రయ పడుతున్నారని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు వై.నేతాజీ అన్నారు. గురువారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రకాష్‌నగర్ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కోట బాబూరావు అధ్యక్షత నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్మిక చట్టాల సవరణ చేస్తూ 8 గంటల పని విధానం స్థానంలో 12 గంటలు, 15 గంటలు పనిచేయాలని మోదీ ప్రభుత్వం తీసుకు వచ్చిన విధానాలను రాష్ట్రంలో అమలు చేయాలని చంద్రబాబు చూస్తున్నారని విమర్శించారు. మహిళలు నైట్ డ్యూటీ చేయాలని క్యాబినెట్ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం అన్యాయమని అన్నారు. జూలై నెలలో 23, 24వ తేదీల్లో గుంటూరులో జరిగే భవన నిర్మాణ కార్మిక సంఘం మహా సభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, వెంగమ్మ, రేణుక, బొక్క సాంబశివరావు, తాడేపల్లి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

మధురకవి అబ్రహాం రచనలు స్ఫూర్తిదాయకం



నివాళులర్పిస్తున్న త్రీటౌన్ ఎస్ఐ షేక్ కరిముల్లా

తెనాలిటౌన్: మధురకవి నూతక్కి అబ్రహం రచనలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని త్రీటౌన్ ఎస్ఐ షేక్ కరిముల్లా పేర్కొన్నారు. రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో గురువారం మధురకవి నూతక్కి అబ్రహాం 26వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. గ్రామ పురవేదిక వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గుర్రం జాషువా ప్రియ శిష్యునిగా ఎన్నో రచనలకు అబ్రహాం శ్రీకారం చుట్టారని కొనియాడారు. అబ్రహం కొలకలూరు గ్రామంలో జన్మించడం గర్వకారణంగా ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో అయినాల మల్లేశ్వరరావు, బర్తిపూడి వెంకటేశ్వరరావు, సుద్దపల్లి నాగరాజు, ఉన్నం ధర్మారావు, కూచిపూడి మోహన్ మాదిగ, కొలకలూరి పాపారావు, నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారి, నూతక్కి అచ్యుతచారి, ఉన్నం భూషణం, సాపాటి కోటేశ్వరి, గద్దె ఝాన్సీ, ఉన్నం సన్నీ, అనిల్, స్వరాజ్ వర్మ, అవినాష్, సతీష్, మణిహార నాయుడు, తదితరులు ఉన్నారు.